క్లుప్తంగా

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీలు

కూసుమంచి: క్రీడా పాఠశాలలకు ఎంపిక కోసం జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈనేపథ్యాన మండలం నుంచి తొమ్మిది మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు యువజన సర్వీసుల శాఖ అధికారులు తెలిపారు. ఎంపికైన వారిలో వినీత్, వీరేందర్, అఖిలేష్, అంకిత్, అరవింద్, నందిని, జాస్మిత, నిహారిక, స్వప్న ఉన్నారు. వీరిని ఎంఈఓ బీవీ రామాచారి, కూసుమంచి ఉన్నత పాఠశాల హెచ్ఎం రేల విక్రమ్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఆర్థిక సాయం

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి కందాల విజయమ్మ ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10వేల చొప్పున 40 కుటుంబాలకు సాయం అందించారు.

మృతుడి కుటుంబానికి..

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కందుల లెమ్‌కి కుటుంబానికి బుధవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తుమ్మలపల్లి నర్సింహారావు, వార్డు సభ్యులు మంద గోపి, నామ ప్రశాంత్, కార్యదర్శి కేలోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

ఖమ్మంగాంధీచౌక్: కమల మెడికల్ అధినేత పారుపల్లి కమల సంస్మరణార్థం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం రోగి సహాయకులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, గోపిల ఆధ్వర్యాన ఆస్పత్రిలోని నిత్యాన్నప్రసాద కేంద్రంలో 400 మందికి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి చిరుకందు, శిల్ప, బిపిన్ చంద్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ విగ్రహావిష్కరణ

కూసుమంచి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈనెల 8న ఖమ్మం రూరల్ మండలంలోని వైఎస్సార్‌టీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి తెలిపారు. విగ్రహాన్ని పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆవిష్కరించనుండగా, రక్తదాన శిబిరం కూడా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ అభిమానులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్‌లో శ్మశానవాటికకు సుమారు రూ.10లక్షల ఖర్చుతో కిలోమీటరున్నర వరకు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ మేదరమెట్ల వెంకటరమణమ్మ తెలిపారు. గతంలో కాలిబాట దారి ఉండడంతో శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించాలంటే నరకయాతన పడేవాళ్లు. దీంతో రైతుల సహకారంతో 30 అడుగుల వెడల్పు గల మట్టి రోడ్డు వేసి గ్రామస్తుల అవస్థలు తొలగించారు.

సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని బీసీ జేఏసీ కార్యాలయంలో వేదాస్ ఏడో ఆవిర్భావ కమిటీ వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక పలువురు మాట్లాడారు. కాలజ్ఞాన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి బోధనలు అనుసరించి, విశ్వబ్రాహ్మణ కుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. అనంతరం బీసీ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టోజు రమేష్, టీ.వీ.రాజు, నాయకులు నాగాచారి, వసంతబాబు, వెంకటేశ్వర్లు తదితరులను వేదాస్ కమిటీ బాధ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేదాస్ రాష్ట్ర బాధ్యులు తూము నాగాచారి, సోమయ్య, సాంబశివరావు, శ్రీనివాస్, రమేష్, సుదర్శన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	ఇన్సిడియస్
శ్రీనివాస	ఇండియానా జోనెస్
సుందర్	నారాయణ అండ్ కో

- ఖమ్మం గాంధీచౌక్

నిండా నిర్లక్ష్యం..!



పోస్టాఫీస్‌కు ఆనుకొని ఉన్న భవనంపై పెరుగుతున్న మర్రిచెట్టు



శిథిలావస్థకు చేరిన పోస్టాఫీస్ గోడ

ప్రమాదపుటంచున పురాతన భవనాలు

- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని కేఎంసీ అధికారులు
- వర్షాకాలం ప్రారంభమైనా రూపొందించని ప్రణాళికలు
- గోడలపై పెరిగిన చెట్లను తొలగించని వైనం
- తూతూమంత్రంగా నోటీసులు జారీ
- చోద్యం చూస్తున్న పాలకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పురాతన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఈ భవనాలపై మొక్కలు మొలిచి, పెద్దవికావడంతో గోడలు నేర్రలు బారి ప్రమాదకరంగా మారాయి. చాలా ఏళ్ల క్రితం ఈ భవనాలను నిర్మించడంతో శిథిలావస్థలకు చేరి పెచ్చులూడి పడుతూ.. వర్షం కురిసినప్పుడల్లా కురుస్తోంది. ఈ నేపథ్యంలో వర్షాకాలం ప్రారంభమైనందున వానలు పడితే ఈ భవనాలతో ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ ఏడాది నగరంలోని శిథిలావస్థకు చేరిన భవనాలను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నేటికీ గుర్తించకపోగా.. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించలేదు. ముందు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు శిథిలావస్థలకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ప్రభుత్వ శాఖలన్నీ కొత్తగా నిర్మించిన ఐడీఓసీ భవనంలోకి వెళ్లగా.. పాత భవనాల్లో పలు శాఖల విభాగాలను సర్దుబాటు చేశారు.

వర్షాలు కురిస్తే మరింత నష్టం..

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో 50 నుంచి 70 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఈ భవనాలను సకాలంలో గుర్తించి తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఆస్తితో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. శ్లాబులు, గోడలపై పెచ్చులు ఊడటంతో ఐరన్ బయటకు వచ్చి.. వాటి నుంచి నీరు కారుతోంది. అసలే జీవావస్థలో ఉన్న భవనాలు వర్షాలు కురిస్తే మరింత దెబ్బతింటాయి. అంతేకాక ఈ భవనాల్లోనే అనేకమంది నివాసం ఉండటంతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన భవనాలను అద్దెకు తీసుకుని వ్యాపారాలను నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ భవనాల పరిస్థితేంటి..?

చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలతో పాటు 20 నుంచి 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కూడా బీటలు బారి శిథిలావస్థకు చేరుకున్నాయి. రెండేళ్లుగా పలు ప్రైవేట్ భవనాలను గుర్తించి కూల్చివేసిన అధికారులు.. ప్రభుత్వ భవనాల జోలికి మాత్రం వెళ్లడం లేదని తెలుస్తోంది. గతంలో ఎన్నెస్పీ క్యాంప్‌లో శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను, పాత ఆర్డో కార్యాలయాన్ని అధికారులు ప్రభుత్వ అనుమతులతో కూల్చివేశారు. ప్రభుత్వానికి సంబంధించి శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దీంతో నగరంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు మరికొన్ని ఉన్నప్పటికీ వాటిని కూల్చేందుకు అనుమతులు మాత్రం తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పాత బస్టాండ్‌కు ఆనుకుని ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, పోస్టాఫీస్‌కు ఆనుకుని ఉన్న భవనంతోపాటు మరికొన్ని కార్యాలయాలకు సంబంధించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇక డీఆర్‌డీఏ కార్యాలయ భవనం కూడా మరమ్మతులకు గురైంది. అయినా ఈ భవనాలను మరమ్మతులు చేయించాలని.. శిథిలావస్థకు చేరుకున్న వాటిని తొలగించాలని అధికారులు నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం.

నోటీసులతోనే సరి..

నగరంలో శిథిలావస్థకు చేరిన భవనాలపై అటు ఆ భవనాల యజమానులు, ఇటు కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. భవనాలు ఏ మాత్రం నివాసయోగ్యంగా లేనప్పటికీ యజమానులు ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదు. అధికారులు దీనిపై తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి మా పని అయిందిలే అని చేతులు దులుపుకుంటున్నారు. నగరంలో దెబ్బతిన్న భవనాలను అధికారులు పూర్తిస్థాయిలో గుర్తించలేదు. కొన్నింటిని గుర్తించినప్పటికీ జీవితకాలం పూర్తయిన భవనాల యజమానులకు నోటీసులు ఇచ్చి.. వాటిని తొలగించాల్సి ఉంటుంది. ప్రైవేట్ భవనాలపై మాత్రమే చర్యలు తీసుకున్న అధికారులు.. ప్రభుత్వ శాఖల భవనాల జోలికి వెళ్లడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా బ్రాహ్మణబజార్, ఖిల్లా, మేదర బజార్, పీఎస్‌ఆర్ రోడ్, పాకబండబజార్, మామిళ్లగూడెం తదితర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయినా ఆ ప్రాంతాలను పూర్తిస్థాయిలో సందర్శించకుండా అరకొర భవనాలను మాత్రమే గుర్తిస్తున్నట్లు అధికారులపై ఆరోపణలున్నాయి.

నోటీసులు ఇస్తున్నాం..

నగరంలో శిథిలావస్థకు చేరిన భవనాలను ప్రతి ఏటా గుర్తిస్తున్నాం. గతేడాది శిథిలావస్థ భవనాలను తొలగించాం. బాగా దెబ్బతిన్న భవనాలను ఖాళీ చేయించి.. వాటిని తొలగించాలని సూచించాం. ప్రభుత్వ భవనాలు ఏమైనా శిథిలావస్థకు చేరినట్లు గుర్తిస్తే వెంటనే వాటిని కార్పొరేషన్ ఆధ్వర్యాన తొలగిస్తాం.

– ఆదర్శ్ సురభి, కమిషనర్, కేఎంసీ

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచండి



సీసీరోడ్డుపై పారుతున్న మురుగును పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటపతిరాజు

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక గ్రామ పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామంగా (నేషనల్ అవార్డు) కోసం జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపుతున్నాం. కేంద్రం బృందం ఎప్పుడైన గ్రామంలో పర్యటించవచ్చు.. గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ వెంకటపతిరాజు పేర్కొన్నారు. బుధవారం పంచాయతీలో పర్యటించి వీధుల్లో ఎక్కడా మురుగు లేకుండా ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో పాటు నల్లా ద్వారా తాగు నీరు అందించాలని, వీధుల వెంట ప్రకృతి వనాల్లోని మొక్కలను సంరక్షించుకోవాలని, రోడ్ల వెంట పెంటకుప్పలను వేయరాదని సిబ్బందికి సూచించారు. పంచాయతీ ద్వారా కూడా ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఇంకుడుగుంతలు తీయించేందుకు ఒక్కో పంచాయతీకి 10 ఇంకుడు గుంతలు ఉపాధి హామీలో నిర్మాణం చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈనేపథ్యాన ఒక నివాసంలో మురుగు నీరు సీసీ రోడ్డుపై పారుతుండడాన్ని గుర్తించి వెంటనే ఇంకుడుగుంత తవ్వకం చేయాలని ఇంటి యజమానికి సూచించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్లపాటి రామారావు, ఉప సర్పంచ్ నున్నా వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి సంగీత తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో పుస్తకావిష్కరణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ చరణ్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.దుర్గారావు సంయుక్తంగా రచించిన స్పెషల్ ఎలక్ట్రికల్ మెషిన్స్ పుస్తకాన్ని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాన్ని రూపొందించడంఅభినందనీయమన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్ చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి చరణ్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

పేదలకు అండగా బీఎస్పీ



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: పేదలతో పాటు అన్ని వర్గాలకు మేలు జరగాలంటే బీఎస్పీకి పాలన కట్టబెట్టాలని బీఎస్పీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని మంగళగూడెంలో జరుగుతున్న ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనికి వెళ్తున్న వారిలో అత్యధికులు బహుజనులేనని, వారికి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. బంగారు తెలంగాణ తెచ్చానని చెప్పి రూ. 5లక్షల కోట్ల అప్పుల తెలంగాణ మార్చారని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల వారికి బీఎస్పీతోనే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఉద్యోగులకు సభ్యత్వాలు



సభ్యత్వాలు పొందిన వెటర్నరీ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: న్యూ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో పశుసంవర్ధక, పశువైద్య విభాగానికి చెందిన 109 మంది ఉద్యోగులకు జిల్లా టీఎన్జీవో ప్రతినిధులు సభ్యత్వాలను అందజేశారు. బుధవారం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్ సాగర్‌లు సభ్యత్వాలను అందజేశారు. 20 ఏళ్లకు పైబడి సర్వీసు కలిగి పాత సొసైటీలో సభ్యత్వం ఉండి ప్లాట్లు రానివారు నూతన సొసైటీలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా అఫ్జల్ హసన్ మాట్లాడుతూ.. రెండేళ్ల సర్వీసు పైబడి, రెగ్యులర్ అయిన ప్రతి ఉద్యోగికి కొత్త హౌసింగ్ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వెటర్నరీ ఉద్యోగుల ఫోరమ్ జీవన్‌బాబు, సత్యనారాయణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు నందగిరి శ్రీను, జీఎస్ ప్రసాదరావు, నీరుకొండ చంద్రశేఖర్, ఎండీ మజీద్, నాగుల్ మీరా, బాగం పవన్, శాబాసు జ్యోతి, స్వప్న, వెంకటేశ్వర్లు, బుద్ధా రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


లాటరీ పద్ధతిలో మైనార్టీ రుణాలకు ఎంపిక



లాటరీ తీయిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో 2022–23కు సంబంధించిన మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. మండలంలో మొత్తం 6 యూనిట్లకు గాను రూ.లక్ష యూనిట్లు 4, రూ.2 లక్షల యూనిట్లు 2 ఉన్నాయి. వీటి కోసం మొత్తం 283 మంది దరఖాస్తు చేసుకోగా.. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.జమలారెడ్డి మాట్లాడారు. మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువతి మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద అన్నం, రైల్వే ఎస్సై

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల దెందుకూరు రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని ఓ యువతి రైలు ప్రమాదంలో మృతి చెందగా.. ఖమ్మం రైల్వే పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవడంతో ఖమ్మం రైల్వే ఎస్సై పారుపల్లి భాస్కరరావు నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతదేహన్ని రైల్వే పోలీసులు, మార్చురీ సిబ్బంది సమక్షంలో బుధవారం నగరంలోని బల్లేపల్లి వైకుంఠ ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెపల్లెకు కాంగ్రెస్..

నేలకొండపల్లి: మండలంలోని పలుగ్రామాల్లో పల్లెపల్లెకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు రామసహాయం మాధవీరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చెరువుమాధారం గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. నాయకులు గఫార్, సఫియా, బండారుపల్లి శ్రీనివాసరావు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేయొద్దు



ఆందోళన చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సబ్ ప్లాన్ నిధులు ఎస్సీ, ఎస్టీలకే ఉపయోగించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రూనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సబ్‌ప్లాన్ నిధులను ఇతర పథకాలకు వాడొద్దని డిమాండ్ చేస్తూ జెడ్పీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సబ్‌ప్లాన్ నిధులను పాలకులు ఇతర పథకాలకు వాడటం వలన ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి నీరుగారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతాల్లో ఐటీడీఏ కార్యాలయాలు, గిరిజన విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జంపానాయక్, కార్యదర్శి కోటేశ్‌నాయక్, నాయకులు రామునాయక కృష్ణ, విక్రమ్, మదన్, వినోద్, రెహమాన్, శ్రీనివాసచారి, జంగిపల్లి రవి, వెంకటేశ్వర్లు, బండి రవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఎస్‌టీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపీచంద్, నెల్లూరి వీరబాబులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పాలేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ఎస్‌టీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాక వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎస్‌టీఓకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేస్తూ.. ప్రతి నెలా ఒకటవ తేదీ కల్లా పెన్షన్ చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు కనీసం రూ.9 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, ఏటుకూరి రామారావు, భాస్కర్‌రావు, భాస్కర్‌రెడ్డి, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, దుర్గారావు, దాసరి స్వామినాథం, మంకెనపల్లి నరసింహారావు, భాస్కర్‌రావు, కళ్యాణం సుదర్శన్‌రావు, రంగారావు, పిచ్చయ్య, జనార్ధన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీపీ కార్మికుల సమ్మె



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేడు(గురువారం) చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాంక్యాతండాలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం స్వీపర్లకు రూ.15,600, ఇతరులకు రూ.19,500, ఎక్స్‌గ్రేషియా కింద రూ.10లక్షలు, రిటైర్మెంట్ అయితే రూ.5లక్షలు ఇవ్వాలని, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అన్ని మండల కేంద్రాల్లో ఎంపీడీఓల కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, బోడ రవి, నారాయణ, మాల్సూరు, సందీప్ కనకరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన ఐజేయూ నేతలు



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ ఇప్పించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు బుధవారం డీఈఓ సోమశేఖరశర్మకు విన్నవించారు. సమాజహితం కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్ల లకు నగరం పాటు జిల్లావ్యాప్తంగా ఫీజురాయి తీ ఇచ్చేలా చూడాలని కోరారు. దీనికి డీఈఓ రెండు రోజుల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు ఫీజు రాయితీ కోసం సర్క్యులర్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వేగినాటి మాధవరావు, నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాసరావు, ప్రెస్‌క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం, నగర నాయకులు కళ్యాణ్, మేడి రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

10న రైతాంగ సమస్యలపై..

నేలకొండపల్లి: రైతాంగ సమస్యలపై క్షేత్రస్థాయిలో ఉద్యమం చేపట్టాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక రావెళ్ల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతులకు ఆరు నెలలు దాటిన డబ్బులు ఇవ్వలేదని మండిపడ్డారు. అంతేకాక ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసిన రైతులకు నేటికీ డబ్బులు ఇవ్వడంపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రచ్చా నరసింహారావు, ఇంటూరి అశోక్, రాయల రవి, సిరికొండ నాగేశ్వరరావు, అప్పారావు, బండి రామమూర్తి, దండా సైదారావు, చావా రామయ్య, తెల్లమేకల శేషుబాబు, ముహిముద్, అమరనేని భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీని నియమించాలని వినతి



జిల్లా జడ్జికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: జిల్లా కోర్టులో పదేళ్లుగా ఖాళీగా ఉన్న సహాయ ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ) పోస్టును భర్తీ చేయాలని కాంగ్రెస్ లీగల్ సెల్ బాధ్యులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం న్యాయవాది, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ఏజీపీని నియమించకపోవడంతో ఇబ్బంది ఎదురవుతున్నందున నియామకానికి చొరవ చూపాలని కోరారు. న్యాయవాదులు మోజెస్ క్రిస్టోఫర్, గరిక సంపత్‌కుమార్, తుశ్లూరి కృష్ణారావు, యాకూబ్, కె.నాగేశ్వరరావు, ఉబ్బన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: ఖమ్మంలో ఈ నెల 9న నిర్వహించే యూనిటీ ఆఫ్ మాల మొదటి వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు గుజ్జ రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బీరోలులో మహా సభ పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మాలల హక్కుల సాధన కోసం భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాలపై ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దామల్ల ఉపేందర్ నాయకులు కమటం లక్ష్మన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓకు..

నేలకొండపల్లి: ఆరోగ్య శాఖ సిబ్బందికి బయోమెట్రిక్ ఫేస్ యాప్ హాజరును తొలగించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండలరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ స్టాఫ్‌కు ఫేస్‌యాప్ హాజరు హేయమైన చర్య అని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీహెచ్‌ఓ చావా దుర్గకు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరన్న, యశోద, తిరపతమ్మ, జ్యోతి, రమణ, స్వాతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 52, 54, 55, 56 డివిజన్‌లలో సుడా నిధులు రూ.80 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మంత్రి అజయ్‌కుమార్ సహకారంతో నగరంలో మట్టి రోడ్లు లేకుండా ప్రజావసరాలకు తగిన విధంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బుర్రి వెంకటేశ్వర్లు, మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, ఏసీపీ గణేష్, సీపీఐ సీనియర్ నాయకుడు బాగం హేమంతరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.